
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
బుధవారం 17 సెప్టెంబరు 2025



విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి కృష్ణవేణి
- మోడల్ స్కూల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణవేణి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ అధికారి కృష్ణవేణి పేర్కొన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల ఏపీ మోడల్ స్కూల్‌ను స్టేట్ అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి సలీంతో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ అకాడమిక్ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం పెంచడం కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాఠశాల పరిసరాలు, వసతి గృహం, వంట గది ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి బోధనా పద్ధతులు ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపుపై పలు సూచనలు చేశారు. పాఠశాల ఆవరణలో తిరుగుతున్న పందులను గమనించిన వారు పందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, పలు విషయాలపై ప్రిన్సిపాల్ సంజీవరెడ్డితో మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ రాముడు, శివశంకర్, గురప్ప, రాధారాణి, గంగాదేవి, రామ్మోహన్ పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ధి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనను అలవర్చుకుని శిక్షా కాలాన్ని పూర్తి చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి సూచించారు. పంచలింగాలలోని జిల్లా జైలును ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు కక్షలను విడనాడి, గతాన్ని మరిచి మంచి పౌరులుగా మారాలని కోరారు. 70ఏళ్ల పైబడిన ఖైదీలు, అనారోగ్యంతో బాధపడే ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, వారికి త్వరలో బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రిజన్ లీగల్ ఎయిడ్‌ల గురించి ఖైదీలకు వివరించారు. ఈ క్లినిక్‌లలో ఒక న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్ సభ్యులుగా ఉంటారని, ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు.

గ్రామాల్లో ఆదాయ వనరులు సృష్టించాలి

జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి, ఇతర పన్నులతో సొంతంగా పంచాయతీలకు ఆదాయాలను సృష్టించుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. విజయవాడ ఏపీఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలకు మంగళవారం డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులైన పన్నులు, ఇతర మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. ఆదాయ వనరులు సమకూర్చుకోవడానికి చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి ఆదాయ వనరులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో జి.భాస్కర్, ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీవోటులు ఏ.జేమ్స్ కృపవరం, పి.ప్రభాకర్, అన్వర్‌బాషా, పి.జగన్నాథం, డీకే దస్తగిరి పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు మ్యాజిక్ డ్రైనేజీలు

డ్రైనేజీ సమస్య లేని గ్రామం లేదనే చెప్పవచ్చు. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగు రోడ్డెక్కి పారిన సందర్భాలు అనేకం. దీంతో పారిశుధ్యం లోపించి.. దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురుగు సమస్యను పరిష్కరించడం కోసం ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాలో మ్యాజిక్ డ్రైన్లను నిర్మించింది. అక్కడ ఈ డ్రైన్లు విజయవంతం కావడంతో మరిన్ని ప్రాంతాల్లో ఈ డ్రైనేజీలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగో ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రెండు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి.



నంద్యాల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా మురుగు అస్తవ్యస్తంగా ఉంది. తద్వారా సీజనల్ వ్యాధులు సైతం వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యాలకు హానీ చేస్తోంది. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎక్కడా కూడా రోడ్లపై మురుగు లేకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో జిల్లాలో త్వరలో మ్యాజిక్ డ్రైనేజీల వ్యవస్థకు తాజాగా శ్రీకారం చుట్టింది. జిల్లాలోని నాలుగు గ్రామాల్లో సదరు మ్యాజిక్ డ్రైనేజీలను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో డ్వామా అధికారులు సైతం ఆయా ప్రాంతాల్లో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు చోట్ల భూమి పూజలు చేసి పనులు ప్రారంభించారు. అయితే తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైనేజీలు నిర్మించడమే కాకుండా ఎక్కడిక్కడ నీరు భూమిలోకి ఇంకిపోవడంతో పాటు భూగర్భ జలాలు కూడా పెరగనున్నాయి.

తక్కువ ఖర్చుతో నిర్మాణం

గతంలో ఎక్కడైనా డ్రైనేజీ నిర్మించాలంటే రూ.లక్షలు, రూ. కోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. పెద్దఎత్తున నిధులు ఖర్చు చేసి నిర్మించినా.. కాలువల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడిక్కడ మురుగు నిలిచిపోయే పరిస్థితులు లేకపోలేదు. రూ. కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో ఫలితం ఉండటం లేదనే ఉద్దేశంతో..కూటమి ప్రభుత్వం నూతన మ్యాజిక్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి తాజాగా శ్రీకారం చుట్టింది. ఉదాహరణ.. ఎక్కడైనా 100 మీటర్లు సీసీ డ్రైనేజీ నిర్మించాలంటే.. రూ. 4లక్షలు ఖర్చు చేస్తే.. మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణం కేవలం.. రూ.90 వేలతో పూర్తయ్యే అవకాశం ఉందని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. ఈ లెక్కన.. మ్యాజిక్ డ్రైనేజీలతో రూ. కోట్లలో నిధులు మిగిలే అవకాశం స్పష్టంగా తెలుస్తోంది.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య(ఫైల్)

నిర్మాణ విధానం ఇలా..

ఎక్కడైనా సిమెంట్ రహదారి పక్కనే మ్యాజిక్ డ్రైనేజీ నిర్మాణం కోసం అర మీటరు వెడల్పు, రెండు మీటర్ల లోతు(గుంత) తీస్తారు. అందులో 75 నుంచి 100 ఎంఎం పరిమాణం ఉన్న సాధారణ రాళ్లు వేస్తారు. ఆ తర్వాత మూడు లేయర్లు(పొరలుగా) కంకర ముక్కలు వేస్తారు. కాలువలో ప్రతి 30 మీటర్లకు ఒక సోక్ పీట్ ఏర్పాటు చేస్తారు. అందులో వివిధ పరిమాణాల్లో ముక్కరాయి వేస్తారు. ఇదిలా ఉండగా... ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రైనేజీలు నిర్మించి విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అమలుకు శ్రీకారం చుట్టింది.

- ఎక్కడికక్కడ నీరు ఇంకిపోయి భూగర్భ జలాలు పెరిగే అవకాశం
- మురుగు సమస్యకు పరిష్కారం
- జిల్లాలోని నాలుగు గ్రామాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- రెండు చోట్ల ప్రారంభమైన పనులు

ఎంపిక చేసిన గ్రామాలు

నియోజకవర్గం	మండలం పేరు	గ్రామం
నందికొట్కూరు	నందికొట్కూరు	కోనేటమ్మపల్లి
డోన్	బేతంచెర్ల	గూటుపల్లి
ఆళ్లగడ్డ	ఉయ్యాలవాడ	కొండుపల్లి
శ్రీశైలం	మహానంది	ఆర్.గాజులపల్లి

మ్యాజిక్ డ్రైనేజీ పనులు చేయిస్తున్నాం



ప్రభుత్వం మ్యాజిక్ డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో నాలుగు గ్రామాల్లో మ్యాజిక్ డ్రైనేజీలు ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నాం. సమగ్ర నివేదికను సైతం ప్రభుత్వానికి నివేదించాం. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నాం. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా చేపట్టిన గ్రామాల్లో మాత్రమే చేస్తాం. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా మ్యాజిక్ డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తక్కువ ఖర్చుతో డ్రైనేజీ వ్యవస్థ రావడం శుభపరిణామం.

- సూర్యనారాయణ, పీడీ, డ్వామా, నంద్యాల

ప్రయోజనం..

ఎక్కడైన మ్యాజిక్ డ్రైనేజీ నిర్మించడంతో.. ఎక్కడి మురుగు నీరు అక్కడే భూమిలోకి ఇంకిపోతుంది. ఇదే క్రమంలో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. వాస్తవంగా.. ప్రస్తుతం సీసీ డ్రైనేజీ 100 మీటర్లు నిర్మిస్తే.. రూ. 4లక్షలు ఖర్చు చేయాలి. అయితే నూతన మ్యాజిక్ డ్రైనేజీ ఇదే 100 మీటర్లు నిర్మిస్తే.. కేవలం రూ. 90 వేలు మాత్రమే ఖర్చు అవుతుందని అధికారుల అంచనా. ఈ లెక్కన తక్కువ ఖర్చుతో.. ఎక్కువ డ్రైనేజీ నిర్మించే అవకాశం ఉంది.



కొండుపల్లెలో మ్యాజిక్ డ్రైన్ నిర్మిస్తున్న దృశ్యం

జిల్లాను ప్రగతి పథంలో నడిపించండి

- స్వచ్ఛాంధ్రను పక్కాగా అమలు చేయాలి
- వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి
- పనితీరు, పురోగతి పరంగా రేటింగ్స్
- కలెక్టర్, ఎస్పీల సదస్సులో సీఎం చంద్రబాబు





సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమష్టిగా కృషి చేసి జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని సీఎం చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతిలో కలెక్టర్లు, ఎస్పీలు, మంత్రుల సమీక్షలో జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై సీఎం మంత్రులు అధికారులకు దిశానిర్ధేశం చేశారు. స్వచ్ఛాంధ్రను పక్కాగా అమలు చేయాలన్నారు. గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు అండగా నిలవాలన్నారు. చేతి వృత్తిదారులు, కులవృత్తుల వర్గాలకు అనుగుణంగా అభివృద్ధి కల్పించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు. ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకరావాలన్నారు. నేటి నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛతా సేవా కార్యక్రమం చేపట్టాలన్నారు. జిల్లాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. అధునాతన టెక్నాలజీని వినియోగించుకుని నేరాలను కట్టడి చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీస్‌స్టేషన్లు ఉండాలన్నారు. శాఖల పనితీరు, పురోగతి పరంగా రేటింగ్స్ ఇస్తామన్నారు. ఆన్‌లైన్ విధానాన్ని ప్రతి శాఖలోనూ వంద శాతం అమలయ్యే విధంగా చూడాలన్నారు. సమీక్షలో కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్‌షెరాన్, మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ పాల్గొన్నారు.

నష్టాల ఉల్లి..!



ఉల్లిగడ్డలను సంచులతో తీసుకెళ్తున్న ప్రజలు

ఉల్లి పంటను సాగు చేసిన రైతులు నష్టాల బాట పట్టారు. మూడు నెలల పాటు ఉల్లి పంటను పండిస్తే ధర లేక రైతన్నలు కుప్పకూలిపోయే పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్న వంగలి గ్రామంలో శ్రీరామ్‌రెడ్డి అనే రైతు రెండెకరాల్లో ఉల్లి పంట సాగుచేశాడు. రూ.లక్ష దాకా పెట్టి పెట్టాడు. గిట్టుబాటు ధర లేక, కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో మంగళవారం పొలం లోనే ఉల్లిగడ్డలను వదిలేశారు. కేజీ ధర రూ.5 పలకడంతో ఉల్లిగడ్డలు కోసిన కూలి రూ.15వేలు అవుతుండటంతో పంటను వదిలేశానని రైతు ఆవేదన వెలిబుచ్చాడు.

- చాగలమర్రి, ఆంధ్రజ్యోతి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు 7
పోలీసుల అదుపులో 16 మంది.. పరారీలో 9 మంది

బనకచర్ల సాక్షిగా నీటి వాటాలపై దాడి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నిరసన తెలుపుతున్న రాయలసీమ సాగునీటి ప్రాజెక్టు సాధన సమితి, సీపీఐ నాయకులు

పాములపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల సాక్షిగా రాయలసీమలోని ప్రాజెక్టుల నీటి వాటాలపై దాడి జరుగుతోందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడి అన్నారు. మంగళవారం ఆ సమితి ఆధ్వర్యంలో బనకచర్ల హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు హక్కుగా ఉన్న నీటిని 30 రోజుల్లో తరలించేందుకు సాగునీటి వ్యవస్థలో ఉన్న ఇబ్బందులను తొలగించాల్సిన పాలకులు, ఆ పనులు చేయడం లేదన్నారు. సీమకు చేరాల్సిన రెగ్యులేటర్ల నీటి ప్రవాహాన్ని మార్చి నెల్లూరు వైపు తరలించే కార్యక్రమం చేపట్టారన్నారు. ఈ విధంగా కృష్ణాజలాలను తరలించే తరుణంలో రాయలసీమలో మరింత బలవంతపు భూసేకరణ చేస్తున్నారన్నారు. సీపీఐరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ రాయలసీమ రైతుల కోసం ప్రాజెక్టులు సాధించేందుకు సీపీఐ మొదటి నుంచి ముందుండి పోరాటాలు చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురాంమూర్తి, రమేష్, సాగునీటి సాధన కమిటీ సభ్యులు గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరినాథుడి హస్తకళా నైపుణ్యం



- కొయ్యలతో కళాకృతుల నిర్మాణంలో దిట్ట
- ఆధునిక డిజైన్ల తయారీలో అందేవేసిన చెయ్యి
- పలువురితో ప్రశంసలు ● ఎన్నో అవార్డులు

అతను వృత్తి రీత్యా ఓ కాంట్రాక్ట్ ఉపాధ్యాయుడు.. ప్రవత్తి హస్తకళా, చిత్ర లేఖనం.. ఆయన బొమ్మలు తయారు చేశాడంటే చాలు.. ప్రతి ఒక్కరూ చూస్తూ ఉండిపోవాల్సిందే. జీవత్వం ఉట్టిపడేలా ఉంటాయి అతడి కళాకృతుడు.. అతడే చింతలచెరువు గ్రామానికి చెందిన హస్త కళాకారుడు హరినాథ్. చిన్నతనంలోనే డ్రాయింగ్‌పై ఉన్న మక్కువతో బొమ్మలు తయారు చేసేవాడు. దీన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు అతడికి శిక్షణ ఇప్పించి మరింత రాటుతేలేలా చేశారు. హరినాథ్ కొయ్యలతో బొమ్మలు తయారుచేసి ఎందరితోనో ప్రశంసలు అందుకున్నాడు.

చాగలమర్రి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హస్తకళ, చిత్రలేఖనంలో అందేవేసిన చెయ్యి. కొయ్యలతో కళాకృతులను అందంగా తీర్చిదిద్దడంతో దిట్ట. కొయ్యలను వయ్యారిభామలు, ఆధ్యాత్మికత ఉట్టిపడే దేవతామూర్తులుగా తయారుచేస్తూ ఎందరితోనో ప్రశంసలు అందుకుంటున్నాడు హరినాథ్. నంద్యాల జిల్లాలోని చాగలమర్రి మండలం చింతలచెరువు చెందిన హరినాథ్ హస్తకళల్లో నైపుణ్యం ప్రదర్శిస్తున్నాడు.



డ్రాయింగ్ అంటే ఇష్టం..

సుబ్బయ్యఆచారి, వెంకటలక్ష్మమ్మ దంపతుల కుమారుడు హరినాథ్ కుమార్. తండ్రి కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. స్వగ్రామంలోనే పదో తరగతి వరకు చదివాడు. చదువుకునే వయసులోనే డ్రాయింగ్ అంటే ఇష్టం. చిన్నతనంలోనే హరినాథ్ బొమ్మలు సరికొత్త డిజైన్‌లు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. పది పూర్తయ్యాక తిరుపతికి వెళ్లి డీటీఎస్ కోర్స్ చేశారు. నాలుగేళ్ల పాటు చెక్కశిల్ప విభాగంలో కోర్స్ పూర్తిచేసి అక్కడి నుంచి హైదరాబాదుకు వెళ్లి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ కళాశాలలో చేరి మూడేళ్ల తెలుగు యూనివర్సిటీలో బీఎఫ్ఏ పూర్తి చేశారు.





అవార్డు అందుకున్న హస్త కళాకారుడు

బొమ్మల తయారీలో..

చదువుకునేటప్పుడు పక్షులు అంతరించిపోతున్నాయి అనే అంశంతో బొమ్మలు తయారు చేయమని అప్పటి ప్రభుత్వం సూచించింది. బొద్దింక బొమ్మను 15అడుగుల్లో స్క్రాబ్‌తో తయారు చేశారు. మునీశ్వరుడి బొమ్మను తల వరకు చెక్కతో తయారు చేశాను. బొమ్మల తయారీపై వరంగల్‌లో జరిగిన యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని ద్వితీయస్థానం సాధించారు.

హర్యానాలో జరిగిన ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకున్న. విజయవాడలోని హరిత రిసర్స్‌లో అమ్మవారి విగ్రహం హైదరాబాదులో దుర్గం చెరువులో వినాయకుడి విగ్రహం తయారు చేసినందుకు యూనివర్సిటీ ప్రొఫెసర్లతో అవార్డు అందుకున్న. వినాయకుడు, లక్ష్మీదేవి, సాయిబాబా, పలు దేవతా మూర్తుల తయారీలో సిద్ధహస్తులుగా పేరుగాంచారు. 2013లో టీటీసీ చేసి 2014లో సమగ్ర శిక్ష అభియాన్‌లో పార్ట్‌టైమ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరారు. చిన్నవంగలి పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు చిత్రలేఖన శిక్షణ ఇస్తున్నారు. చిత్రలేఖనం. హస్తకళలతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఈ కళ నిరాంతరయంగా చేతిపడితో కూడుకున్నది. మంచి బొమ్మలు తయారుచేయాలంటే 4, 5రోజులు పడుతుందని, ప్రభుత్వం ఆదుకుంటే మరింత అభివృద్ధి చెందుతుందని హరినాథ్ తెలిపారు.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

- ఎల్ఆర్ఎస్ చేయించుకోపోతే క్రిమినల్ చర్యలు తప్పవు
- మున్సిపాల్టీలకు ఆదాయం పెంచే విధంగా అధికారుల చర్యలు ఉండాలి
- ఎల్ఆర్ఎస్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించండి
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

నందికొట్కూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో వేసిన అక్రమ లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ విధానం ద్వారా క్రమబద్ధీకరణ చేసుకోవాలని, లేని పక్షంలో క్రిమినల్ చర్యలు తప్పవని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ నూతన విధానంపై ప్రజల్లోనూ, రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లోనూ అవగాహన పెంచేందుకు మున్సిపల్, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ ఎల్ఎస్ఆర్ విధానం అమలులోకి వచ్చి నెల రోజులు అవుతోందని, మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉందన్నారు. ఎల్ఆర్ఎస్ విధానంపై అధికారులు విరివిగా అవగాహన కల్పించాలన్నారు. గత వైసీపీ హయంలో అక్రమంగా 23 లేఅవుట్లు వెలసి లక్షలాది రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్నారు. ఈ ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఎల్ఆర్ఎస్ గడవు దాటాక అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. రెండు మూడు సార్లు నోటీసులు ఇచ్చి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆ తర్వాత కూడా స్పందించకపోతే ఇళ్లు కట్టినా, స్థలాల్లో రాళ్లు పాతినా పడగొడతామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే మాత్రం సహించేది లేదన్నారు. వ్యాపారులు, ప్లాట్లు కొన్న వినియోగదారులు దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బేబి, కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్, ఏసీపీ హాయబ్‌మొహిద్దీన్, టీపీవో రంగస్వామి, నందికొట్కూరు, పగిడ్యాల, మిడ్తూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల తనిఖీ



వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం పంచలింగాల గ్రామంలో గల వక్ఫ్ భూములు సర్వే నెంబర్.301, 319, 320, 325, 324, 326 జిల్లా అధికారులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి పర్వీన్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాషా ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- మార్క్‌ఫెడ్ ద్వారా 6,588 క్వింటాళ్ల ఉల్లి కొనుగోళ్లు
- జాయింట్ కలెక్టర్ నవ్య



వేలం పాటను పర్యవేక్షిస్తున్న జేసీ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకువచ్చిన ఉల్లిని మార్క్‌ఫెడ్ సంస్థ, వ్యాపారుల ద్వారా కొనుగోలు చేయిస్తున్నామని, ఆందోళన చెందొద్దు అని జేసీ నవ్య అన్నారు. సోమవారం 10,022 క్వింటాళ్ల ఉల్లిగడ్డల్లో 2వేల క్వింటాళ్లను రాష్ట్రంలోని వివిధ రైతుబజార్లకు పంపారు. మిగిలిన 8,022 క్వింటాళ్ల ఉల్లిగడ్డలకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో 6,588 క్వింటాళ్లను మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోలు చేసింది. మిగిలిన ఉల్లిని వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈవేలాన్ని జేసీ డా.బి.నవ్య పర్యవేక్షించారు. ఇప్పటికే కర్నూలు మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ సంస్థతో పాటు వ్యాపారులు కొనుగోలు చేసిన ఉల్లిని పెద్దఎత్తున ఉండటంతో బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈనెల 18, 19 తేదీల్లో కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి విక్రయాలు నిర్వహించడం లేదని జేసీ తెలిపారు. కార్యక్ర మంలో సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రెటరీలు సుందర్‌రాజు, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న పాల్గొన్నారు.

అతివలకు ఆరోగ్య భరోసా

- నేటి నుంచి 'స్వస్తనారీ సశక్త్ పరివార్ అభియాన్'



సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ (ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో స్టేట్ నోడల్ ఆఫీసర్లు డిప్యూటీ డైరెక్టర్ రామనాథం ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.నరేష్ ఆధ్వర్యంలో డీఎం హెచ్‌వో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక వైద్యశిబిరాల్లో మహిళలకు గుండె జబ్బులు, మధుమేహం, నోటి, గర్భాశయ క్యాన్సర్లకు పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, జిల్లా టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్, డీఐవో డా.నాగేంద్ర ప్రసాద్, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా.మహేశ్వర ప్రసాద్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డా.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో విడత ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డీఎల్‌టీసీ, ఐటీఐ కర్నూలులో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు నాలుగో విడత అడ్మిషన్ల కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎల్‌టీసీ ఐటీఐ శిక్షణా సహాయ సంచాలకులు ఎఫ్ఏసీ ఆర్.కృష్ణమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఈ నెల 27వ తేదీ చివరి గడువు అన్నారు. ఐటీఐ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకెళ్లి వెరిఫికేషన్‌ను చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు డీఎల్‌టీసీ, ఐటీఐ కర్నూలులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి





సదస్సులో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

- జిల్లా జీడీపీ వృద్ధి సాధించాలి
- ప్రజా సమస్యలపై పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి
- కలెక్టర్, ఎస్పీలకు సీఎం చంద్రబాబు సూచనలు
- హాజరైన మంత్రి టీజీ భరత్, కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు పరిశ్రమలు భారీగా వస్తున్నాయి. ఆ పరిశ్రమలు సకాలంలో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటేనే యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగు పడుతాయని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు ఇచ్చారు. అమరావతిలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం చంద్రబాబు రెండు రోజులు జిల్లాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ అట్టాడ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరు అయ్యారు. మంగళవారం జిల్లాలో కీలక రంగాల్లో పురోగతి, శాంతిభద్రతలు, నేరాలు అదుపులో పోలీస్ యంత్రాంగం చేస్తున్న కృషి తదితర అంశాలపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ఎ.సిరి బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే సీఎం సమావేశానికి హాజరయ్యారు. ముఖ్యంగా జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, హంద్రీ-నీవా ప్రాజెక్టు పత్తికొండ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ అసంపూర్తి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ డాక్టర్ సిరికి సీఎం సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే సమస్యలు, ముఖ్యంగా భూ సమస్యలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని, రైతులు ఆఫీసుల చుట్టూ తిరగకుండా చూడాలని తెలిపారు. ఓర్వకల్లు కేంద్రంగా పరిశ్రమలు బాగా వస్తున్నాయని, వారికి అవసరమైన మౌలిక వసతులు, ప్రభుత్వ అనుమతుల జారీలో జిల్లా యంత్రాంగం పంపాల్సిన ఫైళ్ల తక్షణమే క్లియర్ చేయాలని, ఏ దశలో కూడా పెండింగులో ఉంచవద్దని, పరిశ్రమలు సకాలంలో గ్రౌండ్ అయితే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడుతాయని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే.. మహిళలపై జరుగుతున్న దాడులు, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని నియంత్రించాలని, మద్యం బెల్ట్ షాపులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించినట్లు తెలిసింది. జిల్లా సమగ్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు విజన్ ఇచ్చారని, ఆమేకు ముందుకు వెళ్లి జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ సిరి ఆంధ్రజ్యోతి వివరించారు. ముఖ్యంగా ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించినట్లు వివరించారు.

అమెరికా పర్యటన విజయవంతం

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూష రెడ్డి



కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా వివిధ రంగాల్లో ఉన్న యువ నాయకులతో అమెరికా మధ్య శాశ్వత సంబంధాలు పెంపొందించే లక్ష్యంతో అమెరికాలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ విజిటల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం (ఐవీఎల్‌పీ) పర్యటన విజయవంతంగా ముగిసిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ బి.వినూష రెడ్డి చెప్పారు. స్వదేశానికి తిరిగి వచ్చిన ఆమె మంగళవారం నగరంలోని నెహ్రూనగర్‌లో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించి అమెరికా పర్యటన వివరాలు వెల్లడించారు. గతంలో ఐవీఎల్‌పీ కార్యక్రమం కింద ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ప్రధానులు అటల్ బిహారీ వాజ్‌పేయ్, ఇందిరాగాంధీ మైనార్టీ దేశాయ్ అమెరికాకు వెళ్లారని, తాను కూడా మూడున్నర వారాలు అమెరికాలో పర్యటించి వచ్చానని చెప్పారు. జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసి ఐవీఎల్‌పీ నివేదికను సమర్పించానని తెలిపారు. అమెరికాలో 22 దేశాల ప్రతినిధులను కలిసి ఐవీఎల్‌పీ ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు తెలిపారు. అమెరికాలోని వాషింగ్టన్ డీసీ, మాంచెస్టర్, బోస్టన్, కొలంబియా, సాల్ట్‌లేక్ సిటీలను సందర్శించి అక్కడ చట్టసభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోలతో చర్చలు జరిపినట్లు తెలిపారు. మహిళా రాజకీయ భాగస్వామ్యం విషయంలో అమెరికా ఇంకా వెనుకబడి ఉందని, అక్కడ నల్లజాతి మహిళలకు 1965లో ఓటుహక్కు వచ్చిందని, ఇప్పటి వరకు అమెరికలో ఒక మహిళా అధ్యక్షురాలు లేరని గుర్తు చేశారు. దక్షిణాఫ్రికా దేశంలో మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయన్నారు. జపాన్ మేయర్, దక్షిణాప్రియా మేయర్, యూరప్ నుంచి ఎంపీ, పోలెండ్ నుంచి ప్రతినిధులను కలిసినట్లు తెలిపారు. అమెరికాలోని ఐదు రాష్ట్రాల్లో పర్యటించినప్పుడు హోంలెస్ పీపుల్స్ బిచ్చగాళ్లు ఉన్నారని, అక్కడ నిరాశ్రయులకు డ్రగ్స్ వంటి సమస్యలు ఉన్నాయన్నారు. అమెరికాలో గర్భస్రావం, గన్ కల్చర్‌పై బహిరంగ విభజనలో ఉందన్నారు. 2029లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాలను మహిళా సాధికారత కోసం తీసుకువచ్చిన 33 శాతం రిజర్వేషన్ బిల్లు రాజకీయాల్లో గేమ్ చేంజర్ అవుతుందన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.5 కోట్లు



మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,50,17,143 నగదు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్ కోణాపూర్ తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోని 27 రోజుల హుండీ ఆదాయాన్ని మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. నగదుతో పాటు 950 గ్రాముల వెండి, 138 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు మఠం అధికారులు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో జేపీస్వామి, కృష్ణమూర్తి, దేశాయ్ నరసింహమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

ఉద్యోగం వచ్చిందని సంబరపడ్డాం.. ఇప్పుడు లేదంటారా?

- మెరిట్ జాబితాలో పేరుంది.. సర్టిఫికెట్లు పరిశీలించారు
- ఉద్యోగ జాబితాలో పేరు లేక డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన
- డీఈవోను నిలదీసిన అభ్యర్థులు



డీఈవో శామ్యూల్ పాల్ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

కర్నూలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): 'సార్..! మెగా డీఎస్సీ-2025 మెటిట్ జాబితాలో పేరుంది.. సర్టిఫికెట్లు కూడా పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయని అన్నారు. మాకు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చిందని సంబర పడ్డాం.. కష్టాలు తీరాయని ఆనందించాం. ఉద్యోగ నియామక జాబితాలో మా పేరు లేదు.. ఎందుకు అన్యాయం చేశారు. మా గోడు ఎవరితో చెప్పుకోవాలి..!' అంటూ డీఎస్సీ-2025 అభ్యర్థులు కన్నీటి పర్యంతమయ్యారు. డీఈవో శామ్యూల్‌పాల్‌తో వాగ్వాదానికి దిగారు. మంగళవారం డీఈవో కార్యాలయం ప్రాంగణం చివరి క్షణంలో ఉద్యోగం చేజారిన అభ్యర్థుల కన్నీళ్లతో నిండిపోయింది. జిల్లాలో వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 2,674 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ-2025 నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 52 వేల మందికి పైగా నిరుద్యోగులు పరీక్షలు రాశారు. ఇటీవలే మెరిట్ జాబితా విడుదల చేశారు. మెరిట్ ఆధారంగా ఒక ఉద్యోగానికి ఒకరినే (1:1 నిష్పత్తిలో) సర్టిఫికెట్లు పరిశీలనకు పిలిచారు. మంగళవారం ఉద్యోగ నియామక జాబితాను విడుదల చేశారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన చాలా మంది డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగం రాలేదు. దీంతో తమకెందుకు అన్యాయం చేశారు..? అంటూ డీఈవో కార్యాలయానికి చేరుకొని ఏఆరువు పెట్టారు. డీఈవో శామ్యూల్‌పాల్‌తో వాగ్వాదానికి దిగారు. అయితే.. వారికి ఎందుకు ఉద్యోగం రాలేదో వారి సందేహాలను నివృత్తి చేసి పంపించారు. జిల్లాలో వివిధ కారణాలు వల్ల అర్హత కలిగిన అభ్యర్థులు లేని 88 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంచారు. తనకు డీఎస్సీ పరీక్షల్లో 47.93 మార్కులు వచ్చాయని, ఎస్టీ కోటాలో 110 ర్యాంకు వచ్చిందని, అయితే తనకంటే తక్కువ మార్కులు, ఎక్కువ ర్యాంక్ వచ్చిన వారికి ఉద్యోగం ఇచ్చి నాకు అన్యాయం చేశారని కౌతాళం మండలం హాల్వికి చెందిన అనిత ఏకరువు పెట్టారు. బీసీ-డీ కోటాలో 93 ఉపాధ్యాయ పోస్టులు చూపారని, ఇప్పుడేమో 92 పోస్టులే భర్తీ చేశారని కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన బంగారు మౌనిక అన్నారు. తనకు 73.37 మార్కులు వచ్చాయని, ఒక పోస్టు తగ్గించడం వల్ల 73.43 మార్కులు వచ్చిన అభ్యర్థితో ఆగిపోయిందని చెప్పారు. సర్టిఫికెట్లు పరిశీలనకు పిలిచి ఇప్పుడు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన ఉద్యోగం చేజారిందని వందలాది మంది డీఎస్సీ అభ్యర్థులు కన్నీరుమున్నీరై విలపించారు. ఈ విషయం డీఈవో శామ్యూల్‌పాల్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా రిజర్వేషన్లు వల్ల కొందరు, సరిహద్దు గ్రామాల అభ్యర్థులు కర్ణాటకలో చదివిన వాళ్లు కొందరు అర్హత కోల్పోయారని, వారికున్న సందేహాలను నివృత్తి చేశామని చెప్పారు.

ఉన్నత విద్యామండలిలో ఇద్దరు వైస్ చైర్మన్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యామండలిలో రెండు వైస్ చైర్మన్ పోస్టులను భర్తీ చేస్తూ ఉన్నత విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. వైస్ చైర్మన్-1గా శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును, వైస్ చైర్‌పర్సన్-2గా నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ రత్నశీల మణిని నియమించింది. వీరి పదవీ కాలం మూడేళ్లు. గత ప్రభుత్వం నియమించిన ఇద్దరు వైస్ చైర్మన్లలో ఒకరి పదవీకాలం ఇటీవల ముగియగా, మరొకరు రాజీనామా చేశారు. ఆయా స్థానాలను కూటమి ప్రభుత్వం ఇప్పుడు భర్తీ చేసింది.

ప్రజల్లో వ్యతిరేకత తెచ్చేందుకే చెడు ప్రచారం

- మంత్రి భరత్‌పై ఆరోపణల్లో వాస్తవం లేదు
- ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తెచ్చేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నగరంలోని ఏబీసీ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉన్న వారిలో కొంత మందిని మంత్రి టీజీ భరత్ ఖాళీ చేయిస్తున్నారని దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రిపై తప్పుడు ప్రచారం చేయడం సరి కాదన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి చాలామంది అనధికారికంగా నివసిస్తున్నారని, ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. దాదాపు 900 ఎకరాలకు పైగా క్వార్టర్స్ ఉన్నాయని, ఆ స్థలాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద
- విద్యార్థినులకు 'గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్'పై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద

కర్నూలు కల్చరల్/హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలకలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద అన్నారు. మంగళవారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బీసీ వసతి గృహంలో 7, 8, 9వ తరగతులు చదువుతున్న విద్యార్థినులకు 'గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్' అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శారద మాట్లాడుతూ సెల్‌ఫోన్లతో జాగ్రత్తగా ఉండేలా తల్లిదండ్రులు పిల్లలకు సూచనలు ఇవ్వాలన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలు లైంగిక వేధింపులకు గురైనప్పుడు వెంటనే 1098నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగాధికారి, న్యాయవాది శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యతో పాటూ నైతిక విలువలు, సమాజంపై అవగాహనను ఉపాధ్యా యులు కల్పించాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి శైలజ మాట్లాడుతూ విద్యార్థినులు ప్రయాణాలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అనుమానాస్పద మృతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు. వివరాలు.. ఉయ్యాలవాడకు చెందిన సుశీలమ్మ(65) రెండు రోజులుగా తన ఇంట్లో నుంచి బయలకు రాలేదు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికెళ్లి చూడగా ఆమె మృతి చెంది ఉంది. మృతురాలి కొడుకు వెంకటసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌పీఎఫ్ ఎస్ఐ..



లక్ష్మణ్ నాయక్ (ఫైల్)

డోన్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఎస్ఐ లక్ష్మణ్ నాయక్ (52) మృతి చెందారు. పట్టణంలోని ప్లాట్‌ఫారం-2లో మంగళవారం డీఆర్ఎం కార్యక్రమాన్ని ముగించుకుని ఆర్‌పీఎఫ్ కార్యాలయానికి ఫుట్‌వే ద్వారా ప్లాట్‌ఫారంపై వెళ్తుండగా స్పృహతప్పి కిందపడ్డారు. తోటి సిబ్బంది రైల్వే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు.

వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష



శిక్ష పడిన ముద్దాయి కృష్ణయ్యతో పోలీసులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య ఆత్మహత్య కేసులో భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి తంగమణి తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని చింతలాయపల్లె గ్రామానికి చెందిన నంద్యాల గోపాల్ కూతురు రాజేశ్వరి. ఆమెను అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం చాగల్లు కి చెందిన కనకం కృష్ణయ్యకు ఇచ్చి 2006 వివాహం చేశారు. సుమారు 12ఏళ్ల పాటు వారి కాపురం సాఫీగా సాగింది. అనం తరం వివాదాలు చోటుచేసుకున్నాయి. నిత్యం అదనపు కట్నం తేవాలంటూ కృష్ణయ్య, కుటుంబ సభ్యులు రాజేశ్వరిని వేధించేవారు. ఇది భరించలేక పుట్టింటికి చేరుకుంది. 4 మార్చి 2022న విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడగా ఆస్పత్రికి తరలించారు. అదే రోజు రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందింది. తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ హరినాథరెడ్డి కేసు నమోదు చేశారు. విచారణలు, వాదోపవాదాల అనంతరం మంగళ వారం నిందితుడు కృష్ణయ్యకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ నంద్యాల కోర్టు తీర్పునిచ్చింది. నిందితుడిని జైలుకు తరలించారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం



దిలీప్ (ఫైల్)

సి.బెళగల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన మండలంలోని బురాన్‌దొడ్డి గ్రామంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు దిలీప్(53) తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఐదెకరాలు కౌలు తీసుకున్నాడు. ఐదేళ్ల నుంచి పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, కంది, ఆముదం వంటి పంటలు పండించాడు. తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నాడు. పంటలకు చేసిన అప్పులు రూ.10 లక్షలు పెరిగి వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. పొలానికి తెచ్చిన పురుగుమందును మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నెరవాటి ఆస్పత్రికి షోకాజ్ నోటీస్

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెరవాటి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఈ నెల 13న బాలింత హబీబా మృతిచెందింది. ఈ సంఘటనపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.ఆర్. వెంకటరమణ మంగళవారం ఆస్పత్రికి షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సంఘటనపై ముగ్గురిని విచారణ కమిటీ వేశామన్నారు. డీఐవో సుదర్శన్‌బాబు, డా.ప్రసన్నకుమారి, డెమో ఇన్‌చార్జి రవీంద్రనాయక్‌లను విచారణ కమిటీ సభ్యులుగా ఏర్పాటు చేసి నివేదికను అందజేయాలని ఆదేశించారు. ఈ సంఘటనపై నివేదిక అందిన తర్వాత ఎలాంటి చర్యలు తీసుకునేది ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

ఉల్లి రైతుకు.. కన్నీటి కష్టాలు!

- మార్కెట్లో గుట్టలుగా నిల్వలు, రోడ్డుపై వాహనాల బారులు
- 'ఉచిత' ప్రచారంతో ఎత్తుకుపోయిన జనం



బారులుతీరిన ఉల్లిగడ్డల వాహనాలు



కుళ్లిపోయిన ఉల్లిని డంపింగ్ యార్డుకు తరలిస్తూ..

కర్నూలు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతును కష్టాలు చుట్టుముట్టాయి. కాయకష్టం చేసి, చేతిలో ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టి.. పండించిన పంటను ఏం చేసుకోవాలో తెలియని దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. మార్కెట్లో చూస్తే ఉల్లి బస్తాలు గుట్టలుగా పడి ఉన్నాయి. రోడ్డుపై ఇంకా ఉల్లి లోడులతో వాహనాలు వస్తూనే ఉన్నాయి. మార్కెట్లో కుళ్లిపోయిన ఉల్లిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ... ఇదంతా ఒక ఎత్తయితే.. ఉల్లి గడ్డలను ఉచితంగా ఇచ్చేస్తున్నారనే ప్రచారం ఎలా జరిగిందో ఏమో.. స్థానిక జనం ఆటోలు, బైక్‌లపై వచ్చి మార్కెట్లో ఉన్న బస్తాలను ఎత్తుకుపోయారు. మన రాష్ట్రంలోని రాయలసీమ జిల్లాలే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా, కర్ణాటకలోని రాయచూరు జిల్లాల నుంచి కూడా రైతులు పండించిన ఉల్లి దిగుబడులు అమ్మకానికి కర్నూలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఒక్క కర్నూలు జిల్లా నుంచే ఈ సీజన్‌లో 15.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని అధికారుల అంచనా. ఇది కాకుండా నంద్యాల, అనంతపురం, కడప తదితర జిల్లాల నుంచి కూడా రైతులు అమ్మకానికి దిగుబడులు భారీగా తీసుకొస్తున్నారు. గతేడాది క్వింటా రూ.5 వేల వరకు ధర పలికితే, ఈ ఏడాది క్వింటా రూ.350 నుంచి రూ.500లకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించి ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడం రైతులకు ఊరట ఇచ్చింది. ఏపీ మార్క్‌ఫెడ్ 60,057 క్వింటాళ్ల కొనుగోలు చేసింది. అందులో 3,423 టన్నులు మాత్రమే రాష్ట్రంలోని రైతు బజార్లు, సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేయగా, మిగిలిన 2,631 టన్నుల పంటను మార్కెట్‌లో నిల్వ చేశారు. వ్యాపారులు కొనుగోలు చేసిన 6,202 టన్నుల్లో సగం మార్కెట్ యార్డులోనే ఉండిపోయింది. యార్డులో ఉన్న ఉల్లి గడ్డలు కుళ్లిపోవడంతో దాదాపు వంద క్వింటాళ్లకుపైగా డంపింగ్ యార్డుకు తరలించారు. ఏ ప్లాట్‌ఫారంపై చూసినా ఉల్లి బస్తాలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. మరోవైపు రైతులు భారీ ఎత్తున ఉల్లి పంటను మార్కెట్‌కు తెస్తున్నారు. మార్కెట్ అంతా నిండిపోవడంతో ఎక్కడ నిల్వ చేయాలో తెలియని పరిస్థితి ఉంది. మంగళవారం రైతులు భారీ ఎత్తున ఉల్లి దిగుబడులు అమ్మకానికి మార్కెట్‌కు తీసుకొచ్చారు. కాగా, ఉల్లిగడ్డలు ఉచితంగా ఇస్తారని పరిసర కాలనీవాసులకు ఎవరు సమాచారమిచ్చారో తెలియదు. ఆటోలు, బైకులపై వచ్చి వ్యాపారులు, రైతులు మార్కెట్‌లో ఉంచిన ఉల్లి బస్తాలను ఇష్టారాజ్యంగా తీసుకెళ్లారు. ఆటోలు, బైకులపై వచ్చి ఉల్లి బస్తాలు ఎత్తుకెళ్లారు. ఈ పరిస్థితిని చూసి ఉల్లి రైతులు కన్నీరు పెట్టుకున్నారు. జేసీ బి.నవ్య మార్కెట్‌ను తనిఖీ చేసి, పోలీసులను రప్పించడంతో ఉల్లి బస్తాలు తీసుకువెళ్తున్న వారిని అడ్డుకున్నారు. కాగా, ఇంతవరకు కొనుగోలు చేసిన ఉల్లికిగాను రైతులకు ఏపీ మార్క్‌ఫెడ్ రూ.7.26 కోట్లు ఇవ్వాల్సి ఉంటే రూ.1.54 కోట్లు మాత్రమే చెల్లించింది. మిగిలిన రూ.5.72 కోట్లతోపాటు వ్యాపారులు కొనుగోలు చేసిన ధరపై వ్యత్యాసం 6,202 టన్నులకు రూ.5.22 కోట్లు కలిపి రూ.10.94 కోట్లు ఉల్లి రైతులకు చెల్లించాల్సి ఉంది. తక్షణమే చెల్లించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో 16 మంది.. పరారీలో 9 మంది
- రూ.1.49 కోట్ల విలువైన పందులు, మేకల పట్టివేత
- మారణాయుధాలు, మూడు వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత, పోలీసులు

ఆదోని, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను ఆదోని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి బృందంగా ఏర్పడి ఆదోని శివారులో 16 మంది ముఠా సభ్యులను అరెస్టు చేశారు. మరో తొమ్మిది మంది పరారీలో ఉన్నారు. అరెస్టు అయిన వారి నుంచి 542 పశువులు, పందులు, మేకలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1,49,33,000గా అంచనా వేశారు. రెండు ట్రాలీ వాహనాలు, కారు, ఇనుప రాడ్లు, కత్తులు, రాళ్లు, సీసాలు, కారం పొడి, ఖాళీ కూల్ డ్రింక్స్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రాత్రిపూట పశువులను వాహనాల్లో తరలించే వీరు అడ్డొచ్చిన వారిపై విచక్షణారహితంగా దాడులు చేసేవారని పోలీసులు తెలిపారు. రెండు వారాల క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, ఆదోనిలో పందుల యజమానులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు పోలీసులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలోనూ వీరి నేరాలు వెలుగులోకి వచ్చాయి. జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లోనూ పశువుల దొంగతనాలతో పాటు రాబరీ, డెకాయిట్లకు పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. ఇప్పటివరకు వీరిపై 40 కేసులు నమోదు అయ్యాయని చెప్పారు.

25 మందితో గ్యాంగ్ ఏర్పాటు

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వీరు పశువుల కదలికల సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకున్నారు. 25 మంది సభ్యులతో గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. పశువులను దొంగతనాలు చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు.

అరెస్టయిన వారు వీరే..

ఎరుకల ముత్తన్న, భజంత్రీ కృష్ణ, సిద్ధు, మల్లికార్జున, చంద్ర, హూసలప్ప, రంగన్న, ఎరుకలి నాగరాజు, హనుమంతు, అర్జున్, ఎరుకలి మహేశ్, లంబాడి శంకర్, వాల్మీకి వెంకటేశ్, ఆంజనేయులు, ఎరుకలి సురేష్, రవిచంద్రను పోలీసులు అరెస్టు చేశారు. మరో 9 మంది అక్కడి నుంచి పరారయ్యారని పోలీసులు తెలిపారు. 25 మందిపై కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ హేమలత తెలిపారు.

ఎరువుల దుకాణాలపై అధికారుల దాడి



రికార్డును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి విశ్వనాథ్

రుద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు గ్రామంలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడులు నిర్వహించారు. 14.335 టన్నుల ఎరువు సీజ్ చేసినట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి విశ్వనాథ్ తెలిపారు. రైతుల ఫిర్యాదు మేరకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. లక్ష్మామృత ఏజెన్సీస్, ఝాన్సీ ఏజెన్సీస్, లక్ష్మివెంకటేశ్వర ఫర్టిలైజర్స్ అనే మూడు షాపులపై దాడులు జరిపారు. లక్ష్మి అమృత ఏజెన్సీలో యూరియా 1.39 టన్నులు డీఏపీ 2.60 టన్నులు, ఝాన్సీ ఏజెన్సీలో డీఏపీ 3.250 టన్నులు, లక్ష్మి వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్‌లో 2.7టన్నులు యూరియా, 4.30 టన్నులు డీఏపీ సీజ్ చేశామన్నారు. ఈ మూడు షాపులపై 6ఏ కింద కేసు నమోదు చేసి, మొత్తం 14.335 టన్నులు ఎరువులు సీజ్ చేయగా, వాటిఖరీదు రూ.2,98,834.50గా నివేదికలు ఉన్నతాధికారులకు పంపించినటు తెలిపారు. ఏవో సుమతి, ఏఈవోలు రాజు, ఫైహిమాతబుస్సం పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశామని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పంచలింగాల చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా శ్రీనివాసులుగౌడు, శ్రీకాంత్ వద్ద తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ దుర్గా నవీన్‌బాబు, సిబ్బంది రంగయ్య, చంద్రపాల్, రామలింగయ్య, సుదర్శన్ రాజు పాల్గొన్నారు.

ఐరన్‌బండలో పోలీసుల సోదాలు

- ఆరోపణలు ఎదుర్కొంటున్న 30 మంది గృహాల తనిఖీ
- గ్రామంలో అనుమతి పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో వారం రోజుల క్రితం ఇరువర్గాల మధ్య దాడులు ప్రతి దాడులు నిర్వహించారు. దీంతో గ్రామానికి చెందిన గుర్తు చెప్పని వ్యక్తి 100కు ఫోన్ చేసి ఐరన్‌బండ గ్రామంలో హత్యలు చేసుకునేందుకు ఇరువర్గాల వారు మారణాయుధాలతో సిద్ధంగా ఉన్నారు అని చెప్పడంతో గోనెగండ్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం ఉదయం గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 5మంది ఎస్ఐలు, ఒక పీఎస్ఐ, 51 మంది పోలీస్ కానిస్టేబుల్స్ ఐరన్‌బండ గ్రామానికి వెళ్లారు. ఇరువర్గాలలోని అనుమానిత వ్యక్తుల ఇండ్లలో పోలీసులు సోదాలు చేశారు. మారణాయుధాలు ఉన్నాయా? లేదా? అని వారి ఇండ్లలో పోలీసులు జల్లెడపట్టారు. అయితే గ్రామానికి చెందిన పది మంది వ్యక్తుల దగ్గర ఎలాంటి అనుమతి పత్రాలు, నెంబర్ ప్లేట్స్ లేని 10 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు గొడవలకు దూరంగా ఉండాలని ఒకరిని నమ్మి మరొకరు గొడవలకు పోకూడదని కోరారు. గ్రామంలో ఎలాంటి గొడవలకు పోకుండా ఉంటారో వారికి పోలీసులు ఎల్లవేల సహకారం అందిస్తామన్నారు. చదువుకునే పిల్లలు ఉన్నకుటుంబాల వారు గొడవలకు దూరంగా ఉండాలని కోరారు. అలాగే పలు సూచనలు చేశారు. గ్రామం బాగుండాలని కోరుకుంటు పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరి దగ్గర అయిన మారణాయుధాలు ఉన్నట్లు అయితే పోలీసులకు అప్పగించాలని కోరారు. ఇరువర్గాల వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- డబ్బులు, సర్టిఫికెట్లు ఇప్పించాలి
- హొళగుంద మండలానికి చెందిన యువకుల ఆవేదన



మాట్లాడుతున్న బాధిత యువకులు

హొళగుంద, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆర్మీ, ఫారెస్ట్ డిపార్టుమెంట్లలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశారని, న్యాయం చేయాలని హొళగుంద మండలానికి చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోహెల్, ఈడిగ సురేష్, ఎరుకుల ఆంజనేయులు, సాయి కిషోర్ అనే నిరుద్యోగులతో పాటు హెబ్బటం, నాగరకన్వి గ్రామాలకు చెందిన మరో ఏడుగురు నిరుద్యోగులను అనంతపురం జిల్లాకు గార్లదిన్నె మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముళ్లు ఆర్మీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి మోసం చేశారని చెప్పారు. సోహైల్ దగ్గర నుంచి రూ.4.50 లక్షలు, సాయి కిషోర్ నుంచి రూ.4.2 లక్షలు, ఈడిగ సురేష్ నుంచి రూ.2లక్షలు, ఎరుకుల ఆంజనేయులు నుంచి రూ.2 లక్షలు, హెబ్బటం గ్రామానికి చెందిన నలుగురి వద్ద 8 లక్షలు, నాగరాకన్వికి చెందిన ఇద్దరి వ్యక్తుల నుంచి రూ.3 లక్షలు వసూలు చేసి మోసం చేశారని చెప్పారు. డబ్బులతో పాటు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా వారి వద్దనే పెట్టుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భారద్వాజ్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హొళగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ కూడా అకాడమీ నిర్వాహకులతో మాట్లాడినా వారు స్పందించలేదన్నారు. ఎస్ఐ దిలీప్ కుమార్‌ను వివరణ కోరగా.. పామిడి పోలీసులతో మాట్లాడామని, న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

అప్పు తెచ్చి కట్టాను

మా నాన్న హమాలీ పని చేస్తుంటారు. పనిచేస్తే గానీ పూటగడవని కుటుంబం మాది.రూ.4.5 లక్షలు అప్పు తెచ్చి కట్టాము. వడ్డీ పెరిగిపోవడంతో పాటు అప్పుల వాళ్ల ఒత్తిళ్లు భరించలేకపో తున్నాం. తన తండ్రికి మొహం చూప లేక ఊరు వదలి పోవాలనిపిస్తోంది. **- సొహైల్, హొళగుంద గ్రామం**

డబ్బులు ఇప్పించాలి

నాకు ఉద్యోగం వస్తే, తన తమ్ముళ్ల జీవితాలు సైతం మారుతాయని, నా తండ్రిని ఒప్పించి తమ జీవనాధారం అయిన పందులను అమ్మించి ఉద్యోగం కోసం రూ.2 లక్షలు కట్టాను. తీరా మోసపోవడంతో ఏమి చేయాలో తోచడం లేదు. పోలీసులు స్పందించి, తమ డబ్బులు ఇప్పించాలి. **- ఎరుకుల ఆంజనేయులు, హొళగుంద గ్రామం**

పొలం తాకట్టు పెట్టి డబ్బులు ఇచ్చాను

మా కుటుంబానికి జీవనాధారమైన, ఎకరం పొలాన్ని తాకట్టు పెట్టించి రూ.2 లక్షలు ఇచ్చానని, అటు ఉద్యోగం లేక, ఇటు బతుకుతెరువు కోసం తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక రూ.6వేల జీతానికి మందుల దుకాణంలో పని చేస్తున్నా. ఒక్క ఘటనతో జీవితం మొత్తం నాశనం అయిపోయింది. **- ఈడిగ సురేశ్, హొళగుంద గ్రామం**

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు భరోసా

● శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసా నిలుస్తోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయా మండలాలకు చెందిన 70 మంది లబ్దిదారులకు సుమారు రూ.40లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ దుష్టపాలనతో రాష్ట్రంలో అనేక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధితో పాటు ఆరోగ్యశ్రీ పథకం వర్తించని వివిధ రకాల వైద్య చికిత్సల ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదని కొనియాడారు. గత టీడీపీ పాలనలో రెండున్నర ఏళ్లలోనే తాను రూ.22కోట్ల వరకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలకు ఆర్థిక సాయం అందించినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఏడాదిన్నరలోనే రూ.4కోట్ల సాయాన్ని లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు వివరించారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే దరఖాస్తు చేసుకోవాలని అలాంటి వారిని పార్టీలకు అతీతంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ హయంలో సీఎంఆర్‌ఎఫ్ సాయం మంజూరులో లేనిపోని కొర్రీలతో ప్రజలను వేధించారని మండిపడ్డారు. సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తు చేసుకోవాలంటే ఆరు నెలలు ఉన్న గడువును మూడు నెలలకే కుదించడంతో పాటు అసలు ఆ దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలన్నది కూడా స్పష్టత లేకుండా చేశారని దుయ్యబట్టారు. దీంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులకు గురైనట్లు చెప్పారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీకి సంబంధించి వైసీపీకి చెందిన ఓ కార్యకర్త సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిజానికి అతని తండ్రికే తాము గతంలో సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.80వేల సాయం అందించామని ఆ విషయాన్ని మరచి విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. టీడీపీ నాయకులు వేణుగోపాల్, రవీంద్రబాబు, షాబుద్దీన్, శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, రాజారెడ్డి, అన్నారపు శేషిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, కంచర్ల సురేష్‌రెడ్డి, కంచర్ల మనోహర్, ఖలీలుల్లాఖాన్, రఘుస్వామిరెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలి

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఎంతో బాగుంటుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మిడ్తూరు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ హాస్పటల్ సమాఖ్య అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మండల నాయకులు ప్రభుత్వ ధికారులు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

● ప్రజల క్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మిడ్తూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజల క్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. అలాగే వివిధ శాఖల పని తీరును సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

● జలకనూరు గ్రామానికి చెందిన గుండం వెంకటేశ్వర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కును(రూ.54,705) ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అందజేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు ప్రబలే అవకాశముందని, అధికారులు గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎంపీటీసీ భాస్కరరెడ్డి మాట్లాడుతూ కౌలూరులో విద్యుత్ హెల్పర్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. విద్యుత్ కోతలను నివారించడంలో విద్యుత్ శాఖ సిబ్బంది విఫలమయ్యారన్నారు. గత సమావేశంలో ఎమ్మెల్యే ఆదేశించినా పట్టించుకోవడం లేదన్నారు. సుగాలిమెట్ట అంగన్‌వాడీ కేంద్రానికి రూ.4 లక్షలు నిధులు మంజూరైనా నిర్మాణం ఎందుకు పూర్తి కాలేదని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ప్రశ్నించారు. అక్టోబరు 15 వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిరోధక టీకాల పోస్టర్లు ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, మార్కెట్ యార్డు చైర్మన్ గీత, సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలి

ఆత్మకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్, ఎక్స్‌అఫిషియో సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. పలు తీర్మానాలపై చర్చ ఉంటుందని వెల్లడించారు.

నేడు రక్తదాన శిబిరం

ఆత్మకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): భారత ప్రదాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆత్మకూరులోని బీజేపీ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షబాన పేర్కొన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ప్రధానీ నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ప్రతిఏటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి బాయి

ఆత్మకూరు, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొర పరిరక్షణ మనందరి బాధ్యతని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపల్ పద్మావతిబాయి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓజోన్ పొర వాతావరణంలోని స్ట్రాటోస్పియర్‌పై ఉంటుందని అన్నారు. ఇది సూర్యుడి నుంచి విడుదలయ్యే అతినీలలోహిత కిరణాల నుంచి భూమిపై ఉన్న జీవుల మనుగడకు రక్షణగా నిలుస్తుందని చెప్పారు. అయితే ఓజోన్ పొర క్లోరో ఫ్లోరో కార్బన్స్ వల్ల క్షీణించడం జరుగుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో వాతావరణ కాలుష్యం జరగకుండా చూడాలని ఇందుకోసం ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కృష్ణ, విద్యాసాగర్, రామకృష్ణారెడ్డి, శివరామిరెడ్డి తదితరులు ఉన్నారు.

నంద్యాల రూరల్: ఓజోన్ పొరను మనము రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ సూచించారు. మండల పరిధిలోని పుసులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్, సురేశ్‌బాబు, సుబ్రహ్మణ్యం, సరోజమ్మ, హరిత తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పెన్‌డౌన్ కార్యక్రమం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అనుసరిస్తున్న 2.0 విధానాన్ని రద్దు చేయాలని 18, 19, 20 తేదీల్లో పెన్‌డౌన్ కార్యక్రమం చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫరూక్, రమేశ్ మంగళవారం తెలిపారు. ఈ 2.0 విధానంలోని ఆధార్ ఓటీపీ, మొబైల్ ఓటీపీ, పీడీఎఫ్ ఫీడింగ్ సమస్యలు, ప్రైవేట్ అటెండెన్స్ వగైరా సమస్యల వల్ల ప్రజల రిజిస్ట్రేషన్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు మాలిక్, శివరాం, సంజీవరావ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

67 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 67 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనటట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేబీవీ సుబ్బయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కే 12 టెక్నో సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 130మంది విద్యార్థులు పాల్గొనగా 67 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కే 12 టెక్నో సర్వీసెస్ శరణ్య మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3లక్షల వేతనంతో పాటు రూ.1.5లక్షల వరకు ఇతర ప్రయోజనాలు ఉంటాయన్నారు. తమకు కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌కు అవకాశం కల్పించిన కళాశాల చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ హేమంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

అనవసరమైన యాప్‌ల జోలికి వెళ్లొద్దు

● ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్



మాట్లాడుతున్న డీఎస్పీ

పాములపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో స్మార్ట్ ఫోన్ వాడకం అధికంగా ఉందని, వాటిల్లో వచ్చే అనవసరమైన యాప్‌ల జోలికి వెళ్లి సమస్యలను కొని తెచ్చుకోవద్దని ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్ ప్రజలకు సూచించారు. మంగళవారం పాములపాడు మండలం ఎర్రగూడురులో గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. డిఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్‌లు వినియోగిస్తున్నారని, దాని వల్ల ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, లోన్స్ యాప్స్, ఓటీపీలు, ఆన్‌లైన్ లావాదేవీలు, ఎవరైనా ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే నమ్మవద్దన్నారు. దసరా సెలవులు వస్తున్నాయని బంధువుల వద్దకు, యాత్రలకు వెళ్లే వారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలని, లేకపోతే బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు. గ్రామసభలో పాములపాడు ఎస్.ఐ సురేష్ బాబు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

పాణ్యం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పాణ్యం విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏఈ మధుసూదన్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గోపాల్, శీను, షరీఫ్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

పెద్ద వాగుపై వంతెన నిర్మించాలి

కొత్తపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం-లింగాపురం గ్రామాల మధ్యలో ఉన్న పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి పెద్దవాగు వద్ద వరద ఉధృతికి దెబ్బతిన్న లోలెవెల్ వంతెనను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఏసు రత్నం, నక్కస్వాములు, సంజీవ రాయుడు, దాసు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నంద్యాల ఎడ్యుకేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య, రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్, డీఏ బకాయిలు నేటి వరకు విడుదల కాలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో ఉన్న అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మెమో 57 తక్షణమే అమలు చేయాలని, 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనవసరమైన యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాకీర్‌హుస్సేన్, వీరేశ్వరరెడ్డి, దస్తగిరిభాష, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద చల్లితే ఊరుకోం



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూస్తూ ఓర్వలేక వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తే ఊరుకోబోమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ హెచ్చరించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నంద్యాల మెడికల్ కళాశాలకు నిర్మాణానికి గతంలో మంజూరైన కేంద్ర నిధులు ఏం చేశారని ప్రశ్నించారు. కళాశాలనూ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందాలని నాటకాలు ఆడవద్దని సూచించారు. గతంలో జరిగిన అభివృద్ధికి, ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. త్వరలో చామకాల్వ, విశ్వనగర్‌లలో బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖలీల్, కౌన్సిలర్లు, రామచంద్రరావు, సురేష్ పాల్గొన్నారు.

హిందుత్వం.. ఆత్మ విజ్ఞాన మార్గం



మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

నందికొట్కూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హిందుత్వం ఆత్మ విజ్ఞాన మార్గమని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డా.మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిబాబా మందిరంలో నాలుగు రోజుల ధార్మిక కార్యక్రమాల ప్రారంభమయ్యాయి. బలరామాచార్య చేసిన ధార్మిక ప్రవచనం భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో గణేష్ ధార్మిక సంఘం అధ్యక్షులు ఈపూరి ఓంకారమయ్య, కార్యదర్శి మాకా రాజశేఖర్, కోశాధికారి చింతా వెంకటశేషయ్య, అర్చకులు నరసింహయ్య, శేషస్వామి పాల్గొన్నారు.

దోబీ ఘాట్లకు స్థలం కేటాయించాలి



డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

పాణ్యం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలూరు, ఆలమూరు గ్రామాలలో రజకులకు దోబీఘాట్లకు స్థలం కేటాయించాలని ఏపీ రజక సంక్షేమ, అభివృద్ధి సంఘం నాయకులు శ్రీనివాసులు కోరారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో డీటీ శివశంకరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రజక వృత్తిదారులు దోబీ ఘాట్లు లేక తీవ్ర ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామకృష్ణ, ఎంఎంఎస్ నాయకులు దేవదత్తు పాల్గొన్నారు.

నంద్యాలలో జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ జూడో జట్ల ఎంపిక పోటీలు



జిల్లా స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి అండర్-14, 17బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ప్రారంభించారు. జిల్లా స్కూల్‌గేమ్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, మహిళా సెక్రటరీ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 250మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల క్రీడలకు నిలయమైందని క్రీడాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఎంఈవోలు బ్రహ్మం, శివరాంప్రసాద్, క్రీడల అభివృద్ధి అధికారి ఎంఎస్‌వీ రాజు, క్రీడాభారతి అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్, నంద్యాల జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చలంబాబు, ఏపీఎస్‌పీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు దండెనాగరాజు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

గడివేముల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు వేసే కార్యక్రమం అక్టోబరు 15వ తేదీ వరకు ఉంటుందని డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని గడిగరేవులలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా వేస్తున్న టీకాలను పాడి పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పశుగ్రాసం కోసం రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు పావని, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట ఎదుగుదలకు నానో యూరియా



నాగటూరులో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంట ఎదుగుదలకు నానో యూరియా కీలకంగా పనిచేస్తుందని నందికొట్కూరు వ్యవసాయ సంచాలకులు గిరీష్, ఏవో షెక్షావలి రైతులకు సూచించారు. మంగళవారం నందికొట్కూరు మండలంలోని నాగటూరు, కొణిదేల గ్రామాలలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. టెక్నికల్ అగ్రికల్చర్ అధికారి పనేశ్వరెడ్డి, రైతు సేవాకేంద్ర సిబ్బంది, గ్రామ రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: నానో యూరియా వాడకం వల్ల పంటకు ఎంతో మేలు చేస్తుందని ఏవో పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం బండిఆత్మకూరులో రైతులకు నానో యూరిపై అవగహన కల్పించారు. అర లీటరు నానో యూరియా ఒక బస్తా యూరియా మూటకు సమాన మేలు చేస్తుందని, నానో యూరియాను వాడాలన్నారు. సిబ్బంది లక్ష్మయ్య, హిమబిందు పాల్గొన్నారు.

విద్యార్థులతో స్నేహ పూర్వకంగా మెలగాలి

పగిడ్యాల , సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్పీటీసీ పుల్యాల దివ్య అన్నారు. పగిడ్యాలలోని కేజీబీవీ పాఠశాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థిలతో స్నేహ పూర్వకంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషన్న, ఎంఈవో సుభాన్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉష, ఉపాధ్యాయులు ఉన్నారు.

భాగ్యమ్మ మృతికి పలువురు నేతల సంతాపం



మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

పగిడ్యాల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ బండి జయరాజు తల్లి బండి భాగ్యమ్మ (84) మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టరు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు నెహ్రూనగర్ గ్రామానికి చేరుకొని భాగ్యమ్మ మృతదేహం పై పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న టి.రామచంద్రుడు

నంద్యాల రూరల్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. నంద్యాల సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇప్పటికే మొక్కజొన్న కోసిన రైతులు మధ్యదళారులకు కేవలం రూ.2000లకే అమ్ముతున్నారన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు మద్దతు ధర అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు గౌస్‌కృష్ణ, మహేంద్ర పాల్గొన్నారు.

బీజేపీ సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న అభిరుచి మధు

నంద్యాల కల్చరల్, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అబిరుచి మధు ఆధ్వర్యంలో బుధవారం నుంచి అక్టోబరు 2 వరకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం నంద్యాల బీజేపీ కార్యాలయంలో జిల్లా మండల అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్లు, జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అబిరుచి మధు మాట్లాడుతూ ప్రధాని మోదీ జన్మదినోత్సవాన్ని ప్రజల కోసం సేవా పండుగగా చేయాలని కార్యకర్తలకు సూచించారు.

ఇంజనీర్లకు ఘనంగా సన్మానం



ఇంజనీర్లను సన్మానిస్తున్న అవోపా నాయకులు

నంద్యాల హస్పిటల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్స్ డే సందర్భంగా సోమవారం నంద్యాల అవోపా కార్యాలయంలో సముద్రాల మధుసూదన్‌రావు అధ్యక్షతన పది మంది ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో విశేష సేవలందించిన చిన్న సత్యానారాయణ, కొత్తవెంకటశేషయ్య, రాజాసుబ్బనారాయణ, హరినాథ్‌బాబు, మల్లయ్య, రవికుమార్, చంద్రశేఖర్, వెంకటశేషుబాబు, నాగరాజు, శ్రీనివాసరావులను సతీసమేతంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు వీజీకే మూర్తి, కార్యదర్శి జనార్దన్, కోశాధికారి చంచయ్య, విద్యానిధి అధ్యక్షుడు పాల్గొన్నారు.

'ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలి'

బండిఆత్మకూరు సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భోజనం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి అస్వస్థతకు కారణమైన ఆర్ఎంపీ వైద్యుడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు వెంకట సుబ్బన్న డిమాండ్ చేశారు. మంగళవారం బండిఆత్మకూరులో ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివ, చిన్న సుబ్బరాయుడు, సురేష్, శ్రీనివాసులు, సుబ్బయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నంద్యాల రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో ఈ నెల 15న నిర్వహించిన 69వ ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నెట్‌బాల్ సెలక్షన్ టోర్నమెంట్లో నంద్యాల ఎస్‌డీఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్ చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో గెలుపొందిన గురుచరణ్, కార్తికేయరెడ్డి, టి.వినోద్‌కుమార్, బి.రితేష్‌రెడ్డిలను మంగళవారం పాఠశాల యాజమాన్యం అభినందించింది.

వైభవంగా శ్రీకృష్ణ జయంతి



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న ఆలయ ప్రధాన అర్చకులు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శ్రీకృష్ణ జయంతి, ఉట్ల పండుగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం ప్రహ్లాదవరద స్వామి వారిని, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను, నవనీత కృష్ణ స్వామి విగ్రహాలను ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి ఆధ్వ ర్యంలో ఆలయ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయంలో ఉట్టి వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆర్థికంగా ఎదగాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ సూచించారు. మంగళవారం పట్టణంలోని సచివాలయం- 4లో ఏర్పాటు చేసిన మహిళల స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని బీసీ ఇందిరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని సామర్థ్యాలను పెంచుకుంటున్నారన్నారు. మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఇందుకు అనేక పథకాలు ప్రవేశపెడుతున్నాయన్నారు. మహిళలు తమ నైపుణ్యాలను , సామర్థ్యాలను పెంచుకోవాలని ఆయా రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జునీఫక్రుబీ, డీఐసీ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కానివ్వం



మాట్లాడుతున్న తహసీల్దారు

బనగానపల్లె, సెప్టెంబరు 16, (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ, వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం కానివ్వమని తహసీల్దారు నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్‌తో కలిసి తహసీల్దారు మాట్లాడారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఎవరు ఆక్రమించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జుర్రేరువాగులో అక్రమంగా నిర్మించిన కట్టడాలను, ఇళ్లను కూడా తొలగించామన్నారు. ఇంకా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చామన్నారు. ఎస్సార్బీసీ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు.

సనాతన ధర్మం గొప్పది



ప్రచార పాదయాత్రలో ఇస్కాన్ సభ్యులు

రుద్రవరం/ఆళ్లగడ్డ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): సనాతన హిందూ ధర్మం ఎంతో గొప్పదని అహోబిలం ఇస్కాన్ ప్రతినిధి చంద్రశేఖర దాస్ అన్నారు. సనాతన ధర్మంపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇస్కాన్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం రుద్రవరం మండలం హరినగరం నుంచి అహోబిలం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతపై దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి ఆరుసార్లు పూర్తి చేసి ఏడవ సారి చేపట్టామన్నారు. అహోబిలం నుంచి తిరుపతి, రామేశ్వరం వరకు పాదయాత్ర సాగుతుందన్నారు. ఇస్కాన్ ప్రతినిధులు మహారాష్ట్రకు చెందిన ఆచార్యదాస్, మోహన్‌గోపాల్, భద్ర బలరామదాస్ సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు.

పర్యావరణాన్ని కాపాడాలి

శిరివెళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 31వ ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ ఖాసీం సాహెబ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మంద కృష్ణ మాదిగ రాక

బేతంచెర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈ నెల 18న నంద్యాలకు రానున్నారని ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అఖిల్ మాదిగ తెలిపారు. మంగళవారం పట్టణం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. మంద కృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ముఖ్యఅతిథులు జాతీయ అధ్యక్షులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ మున్నాంగి నాగరాజు మాదిగ పాల్గొంటారని తెలిపారు. మండలాల నుంచి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కోరారు. సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆట వస్తువుల వితరణ

డోన్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): యు.కొత్తపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు డోన్ వివేకానంద స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఆట వస్తువులు వితరణ చేశారు. మంగళవారం మైక్ సెట్, ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, హెచ్‌ఎం చంద్రశేఖర్, సమితి కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాసులు, ఫౌండర్ మలిశెట్టి జగన్మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, ఉపాధ్యక్షులు బి.గంగిరెడ్డి దలవాయి కుళ్లాయప్ప, సర్పంచ్ విద్య, పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలం

రుద్రవరం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం మండలంలోని కోటకొండ పంచాయతీ మజరా కె.కొత్తూరు గ్రామాన్ని పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శి నరసింహావర్మ తదితరులున్నారు.

శిథిలావస్థలో రెవెన్యూ కార్యాలయం

- దెబ్బతిన్న పైకప్పు దూలాలు
- వర్షపు నీటితో కార్యాలయం చిత్తడి
- పాడైపోతున్న ఫైళ్లు
- బ్రిటీష్ కాలం నాటి భవనానికి కొరవడిన మరమ్మతులు

ప్యాపిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు దూలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షపు నీటికి ఫైళ్లు పాడైపోతున్నాయి. అయినప్పటికీ కార్యాలయం మరమ్మతుల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్యాపిలి తహసీల్దారు కార్యాలయాన్ని బ్రిటీష్ కాలంలో నిర్మించారు. దాదాపు నాలుగు ఎకరాల విశాల మైదానంలో ఆనాటి పద్ధతిలో బ్రిటీష్ వారు ఎంతో సుందరంగా భవనాన్ని నిర్మించారు. విశాలమైన గదులు, గాలి, వెలుగు వచ్చేలా కిటికీలు, తలుపులు నిర్మించారు. ఎండలు మండే సమయంలో కూడా కార్యాలయంలో చల్లటి వాతావరణం ఉంటుంది. మెయిన్ టెనెన్స్ లేకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు దూలాలు విరిగిపోయాయి. పైకప్పు నుంచి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. దీంతో కార్యాలయంలోని ఫైళ్లతో పాటు ఇతర వస్తువులు కూడా పాడైపోతున్నాయని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.



తహసీల్దారు కార్యాలయం



దెబ్బతిన్న దూలాలు



కార్యాలయంలో వర్షం నీరు పడేందుకు ఏర్పాటు చేసిన డబ్బాలు

కొరవడిన మరమ్మతులు

బ్రిటీష్ కాలంలో ఎంతో అందంగా రూపుదిద్దుకున్న తహసీల్దారు కార్యాలయం ఇప్పుడు అంద వికారంగా తయారవుతోంది. భవనం పైప్పుతో పాటు గోడలు కూడా పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడుతున్నాయి. దశాబ్దాలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా ఏ ప్రభుత్వాలు భవనం మరమ్మతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ నిర్లక్ష్యాన్ని ఇలాగే కొనసాగిస్తే ఆనాటి కట్టడాలకు చిహ్నంగా ఉన్నా తహసీల్దారు భవనం కనుమరుగయ్యే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

వర్షం వస్తే చిత్తడే

వర్షం వస్తే కార్యాలయంలో పరిస్థితి అధ్వానంగా తయారవుతుంది. వర్షపు నీటితో చిత్తడిగా మారుతుంది. దీంతో వర్షం పడేచోట డబ్బాలు పెట్టుకొని సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం స్పందించి కార్యాలయానికి కొత్త భవనం నిర్మించకపోయినా కనీసం మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పేదలకు వరం.. సీఎం సహాయనిధి: ఎమ్మెల్యే

డోన్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును అందజేశారు. గత ఏడాది మధుకుమార్ బ్యాంకాక్‌లో కిడ్నాప్‌కు గురయ్యారు. సురక్షితంగా మధుకుమార్‌ను రప్పించేందుకు ఎమ్మెల్యే కోట్ల ముందడుగు వేశారు. ఆ సమయంలో ఖర్చయిన మొత్తం తిరిగి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. హామీ మేరకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.10 లక్షల చెక్కును మధు కుమార్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమను ఆదుకునందుకు ఎమ్మెల్యే కోట్లకు, సీఎం చంద్రబాబుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, చిన్నమల్కాపురం సుధాకర్ రెడ్డి, మురళిగౌడు, తదితరులు పాల్గొన్నారు



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

రైతుల ముఖాల్లో ఆనందం చూడాలి

ప్యాపిలి : రైతుల ముఖాల్లో ఆనందం చూడలన్నదే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు భారతి, వెటర్నరీ ఏడీ విక్టర్, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, ఖాజాపీర్, రామ్మోహన్ యాదవ్, చల్లా వీరాంజినేయుల, నాగేంద్ర, మధు, రాజా రవి, ప్రసాద్ రెడ్డి, కలచట్ల ప్రసాద్ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను తప్పనిసరిగా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, డాక్టర్ చిన్నబాబు సూచించారు. మంగళవారం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పశువులకు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు జ్వరం, నీరసం, నోటి నుంచి చొంగ రావడం, సుడి పశువులు ఈసుకపోవడం జరుగుతుందని అన్నారు. దీంతో పాల ఉత్పత్తి తగ్గుతుందని అన్నారు. గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని అన్నారు. పశువులకు గాలికుంటు టీకాలు వేయడం వల్ల పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు



పశువులకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి చిన్నబాబు

కార్యక్రమంలో ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ డీవీ రమణయ్య, ఏడీ డాక్టర్ నాగరాజు, వెటర్నరీ అసిస్టెంట్ చిన్నబాబు, వైద్య బృందం అన్వర్‌బాష, లక్ష్మణచంద్ర, సుమణ, సుస్మిత ఉన్నారు.



టీడీపీలో చేరిన నాయకులతో భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి

టీడీపీలో చేరిక

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకందు కూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గంగుల కుటుంబ ముఖ్య అనుచరుడు కొలిమి హుసెన్‌బాషా, పలువురు వైసీపీ నాయకులు మంగళవారం టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి కండువా కప్పి హుసెన్‌బాషాను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు తెలిపారు.

అసత్య ఆరోపణలు సరికావు



సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 16, (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రభుత్వ, వక్ఫ్‌భూములు ఆక్రమించాల్సిన ఖర్మ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు పట్టలేదని, అలాంటి ఆరోపణలు చేయడం సరికాదని బనగానపల్లె ఉపసర్పంచ్ బురానుద్దీన్ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో దూదేకుల సంఘం రాష్ట్ర డైరెక్టరు మహబూబ్ కాశీంసాహెబ్, భాను ముక్కల సొసైటీ చైర్మన్ అత్తార్ అబ్దుల్ కలాంతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వక్ఫ్‌భూములు ఆక్రమించారంటూ ఓ పత్రిక అసత్య కథనాలు ప్రచురించ డం తగదన్నారు. గత 30 ఏళ్లగా పీర్ల చావడి మాన్యం భూములు గాని, ప్రభుత్వ భూములు గాని ఒక సెంటు స్థలాన్ని టీడీపీ కార్యకర్తలు ఆక్రమించలేదన్నారు. పట్టణంలో పాతబస్టాండ్‌లో కోట్ల విలువ చేసే వక్ఫ్ భూములు ఆక్రమించుకుంటే వాటిని పరిరక్షించిన ఘనత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిదే అన్నారు. పట్టణ నడిబొడ్డున ఉన్న జుర్రేరువాగును ఆక్రమించుకుంది వైసీపీ వారేన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు అబద్ధపు ప్రచారాలు చేస్తూ మంత్రి బీసీపై బురదచల్లడానికి యత్నిస్తున్నారని, వారి దుష్ప్రచారం నమ్మే స్థితి లో జనం లేరన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు రాయలసీమ సలాం, ఇస్మాయిల్ ఖాన్, గౌండాబాబు, హర్షద్ పాల్గొన్నారు.

మూట్ కోర్టులో లా విద్యార్థి ప్రతిభ



అవార్డు అందుకుంటున్న సాహితి

డోన్ టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నిర్వహించిన మూట్‌కోర్ట్‌లో లా విద్యార్థి ఎన్.సాహితి ప్రతిభ కనబరిచారు. డోన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఎన్.నరసింహుడు, ఎన్.లావణ్యల కుమార్తె సాహితి తిరుపతి అంబేడ్కర్ గ్లోబల్ న్యాయ కళాశాలలో లా విద్యను అభ్యసిస్తోంది. గుజరాత్‌లోని పారుల్ యూనివర్సిటీ సంవిధాన్ పే చర్చా-2025లో 110 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. మూట్ కోర్టులో సాహితి ప్రతిభ కనబర్చడంతో మొదటి రన్నరప్ ప్రైజ్‌తో పాటు క్యాష్ అవార్డును లా కమిషన్ ఆఫ్ ఇండియా హానరబుల్ ఛైర్ పర్సన్ జస్టిస్ దినేష్ మహేశ్వరి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిసింగ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ కుమార్ శుక్ల అందజేశారు. న్యాయవాది ఎన్.నరసింహుడు కూతురుకు అవార్డు రావడంతో డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.మద్దయ్య, సీనియర్ న్యాయవాదులు శ్రీహరి, మురళీధర్ రావు, కోట్ల హరిచంద్రారెడ్డి, ఎం.నాగభూషనంరెడ్డి, కానాల మహేష్, ఇ. వేణుగోపాల్‌గౌడు, అంజనేయులుగౌడు, ఎస్టీ హరుణ్, రామలింగయ్య, మద్దిలేటి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

డోన్ రూరల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారక రామనగర్ 31వ వార్డులో కార్యకర్త కుటుంబాన్ని వైసీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి పరామర్శించారు. వైసీపీ కార్యకర్త సుబ్బారెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతకుముందు పట్టణంలోని కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు దొర్నిపాడు మండలం గుండుపాపలకు చెందిన మద్దిరాల సైమన్ (34) సోమవారం సంజామల మండలం ఆర్.లింగందిన్నెకు వెళ్లి బైకుపై తిరిగి స్వగ్రామమైన గుండుపాపలకు బయలుదేరారు. జోళదరాశి గ్రామ సమీపంలో ఉన్న సాయిబాబా గుడి సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. సైమన్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు కోవెలకుంట్ల ప్రభుత్వసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఎస్తేరురాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

బనగానపల్లె, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఈవో సతీశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఈవో మాట్లాడుతూ పట్టణంలో చాలా చోట్ల అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, వాటిని క్రయవిక్రయాలు చేయరాదన్నారు. అనధికార లే అవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తే బ్యాంకు రుణాలు కాని, రిజిస్ట్రేషన్లు గాని కావన్నారు. అనధికారి లే అవుట్లను రెగ్యులైజేషన్ చేసుకునే స్కీం కొత్తగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో పాల్గొనాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

సీఐటీయూ మండల కార్యవర్గం ఎన్నిక

ప్యాపిలి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఐటీయూ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రామాంజినేయులు, ఉపాధ్యక్షులుగా రంగస్వామి, నెట్టికల్లు, ప్రధాన కార్యదర్శిగా చిన్నరహిమాన్, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, రామానాయుడు, కోశాధికారిగా లక్ష్మణ్, పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సంఘం నాయకులు శివరామ్, భాస్కర్‌రెడ్డి, చిన్నరహిమాన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నవంగలి ఉన్నత పాఠశాలలో, చాగలమర్రి అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓజోన్ పొర ఆకారంలో విద్యార్థులు కూ ర్చు న్నారు. వివిధ నాటి కలు, చిత్రలే ఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు నాగేంద్రకు మార్, సుబ్బారెడ్డి, వైదేహి, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

చాగలమర్రి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సిక్స్ సైడ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహించారు. హెచ్‌ఎం జీవయ్య పోటీలను ప్రారంభించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరాయుడు, కార్యదర్శి వెంకటేష్, పీడీలు దాదాపీర్, శ్రీనాథ్‌రెడ్డి, అలివేలుబాయి, ఇన్‌చార్జి హెచ్‌ఎం కృష్ణశాస్త్రీ, మహబూబ్‌బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

చాగలమర్రి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం పెద్దబోదనం, నేలంపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి పాల్గొన్నారు.

పంట నమోదు వేగవంతం చేయాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగేంద్రప్రసాదు సూచించారు. ఆయా గ్రామాలకు చెందిన వీఏఏలతో పంట నమోదుపై సమీక్షించారు. నిర్దీత సమయంలో పంట నమోదు కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను నమోదు చేయించుకోవాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేవనూరు, లింగాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. టీడీపీ నాయకులు రేవనూరు సొసైటీ చైర్మన్ సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, లింగాల నాయుడు, రైతులు పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించుకోవాలి

దొర్నిపాడు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియాను పంటలకు వాడటం వల్ల అనేక లాభాలు ఉన్నాయని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. మంగళవారం దొర్నిపాడు గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువుల వాడటం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

శిరివెళ్ల, సెప్టెంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుటుంబానికి దాతలు అండగా నిలిచారు. గ్రామంలోని ఎల్లమ్మపేటలో నివాసం ఉంటున్న శిరిగిరి నారాయణమ్మ, ఆమె కుమారుడు నాగ రాజారెడ్డి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవ్వడంతో దాతలు ప్రసాద్ బాబు, సుగుణ సీడ్స్ కడియాల నాగేశ్వరరావు, యర్రగుంట్ల సహకార సంఘం చైర్మన్ తపసి శ్రీరాములు, మాబు హుసేన్ స్పందించి బాధిత కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేశారు, కార్యక్రమంలో ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ శీలం రామ్మోహన్ పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం గ్రామంలో స్నేహితుడు జంబులయ్యకు మిత్రులు రూ.20వేలు ఆర్థిక సాయం మంగళవారం అందించారు. మిత్రుడు జంబులయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా సమాచారం అందుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో విజయ్, మద్దిలేటి, అబుసల్లా, ప్రసాద్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలు పాటించాలని మోటార్ వైహికల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బయ్య సూచించారు. మంగళవారం మండలంలోని ప్రధాన రహదారుల్లో వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సరైన పత్రాలు లేకుండా వెళ్తున్న వాహనాలను, అధిక లోడుతో వెళ్తున్న నాలుగు వాహనాలకు జరిమానా విధించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు జరిమానా విధించారు.